



పార్టీ ప్రముఖులతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్న తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్

విద్యానిధులు విడుదల చేయరా?


● కేంద్ర తీరును నిరసిస్తూ తిరువళ్లూరు ఎంపీ ఆమరణ దీక్ష

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెల్లించాల్సిన విద్యానిధులను విడుదల చేయని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్ తిరువళ్లూరులో శుక్రవారం ఉదయం నిరాహార దీక్ష చేపట్టారు. తిరువళ్లూరులోని రాజీవ్‌భవన్ వద్ద ఆయన ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి విద్యానిధులను కేటాయించకపోవడం గర్హనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యానిధులను విడుదల చేసే వరకు తాను ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించనున్నట్లు ప్రకటించారు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి కాంగ్రెస్ అహింసా మార్గంలోనే ఆందోళనలు నిర్వహిస్తోందని, ఆ పార్టీ మార్గంలోనే తాను ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించానని చెప్పారు. ఇది తన వ్యక్తిగత ఆందోళన కాదని, రాష్ట్రంలో విద్యానిధులు విడుదల కానందువల్ల నష్టపోతున్న బడిపిల్లల తరఫున తాను ఈ ఆందోళనను చేపట్టానన్నారు. విద్యానిధులు నెలల తరబడి విడుదల చేయని కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టకపోతే పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. విద్యారంగంలో అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉన్న తమిళనాడుకు నిధులు విడుదల చేయకుండా మొండి వైఖరిని అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం కూడా ఉందన్నారు. అది రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులు, సామాజిక సంస్థల నిర్వాహకులు తాను జరుపుతున్న ఆందోళనలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ధి కోసం తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగలేదని, పలుమార్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలుసుకుని విద్యానిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు.

ఓట్ల చోరీపై అప్రమత్తంగా ఉండండి

● పార్టీ శ్రేణులకు డీఎంకే అధినేత స్టాలిన్ పిలుపు

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బిహార్ తరహాలో రాష్ట్రంలోనూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) పేరుతో ఓట్ల చోరీకి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయంలో పార్టీ శ్రేణులు, ప్రత్యేకించి పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జీలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. నగరంలో శుక్రవారం ఉదయం జరిగిన డీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె రాఘవి వివాహ వేడుకల్లో ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌తో పాటు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం, డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి సామినాథన్, ఎంపీ తిరుచ్చి శివా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశం అతిక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నదన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం కేంద్రంలోని పాలకపక్షానికి సానుకూలంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. బిహార్‌లో జరిగిన ఓట్ల చోరీ ఎంతటి తీవ్ర ప్రభావం కలిగిస్తోందో అందరికీ తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో నిర్వహించిన నిరసన ర్యాలీలో తాను కూడా పాల్గొన్నానని, ఆ ర్యాలీకి ప్రజానీకం నుంచి మంచి స్పందన కనిపించిందన్నారు. బిహార్ పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడకుండా పార్టీ శ్రేణులు, మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు సైతం అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంఘం అధికారులు తప్పిదాలకు పాల్పడేందుకు వస్తే అడ్డుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం జరిపే ఓట్ల చోరీని నిరోధించే దిశగా ఎన్ఆర్ ఇళంగో చట్ట పోరాటం సాగించారని కూడా స్టాలిన్ చెప్పారు.



డీఎంకే ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె రాఘవి వివాహ వేడుకల్లో సతీసమేతంగా పాల్గొన్న సీఎం స్టాలిన్, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం, డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు, ఎంపీలు తదితరులు

రూ.10లక్షల కోట్ల పెట్టుబడిని సమీకరించా...

విదేశీ పారిశ్రామిక పెట్టుబడులను సేకరించే దిశగా తాను శనివారం ఉదయం జర్మనీ, ఇంగ్లండ్ దేశాల పర్యటనకు వెళుతున్నానని సీఎం స్టాలిన్ చెప్పారు. వారం రోజులపాటు విదేశాల్లో పర్యటించి, రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే దిశగా పెట్టుబడులను సేకరించనున్నానని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా రూ.10లక్షల కోట్ల పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించినట్లు ఆయన వెల్లడించారు. తన విదేశీ పర్యటనలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో ద్రవిడ ఉద్యమనేత పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించబోతున్నానని తెలిపారు.

వేలాంకన్ని వార్షికోత్సవాలు ప్రారంభం



బిసెంట్‌నగర్ వేలాంకన్ని ఆలయ పతాకావిష్కరణకు తరలివచ్చిన భక్తజనం

● పతాకావిష్కరణకు పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేలాంకన్నిలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన సెయింట్ ఆరోగ్యమాత వార్షికోత్సవాలు శుక్రవారం సాయంత్రం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. తంజావూరు బిషప్ టి.సహాయరాజ్ తంబురాజ్ ప్రత్యేక ప్రార్థనలతో సాయంత్రం 5.45 గంటలకు అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య వీధుల్లో ఊరేగించారు. అనంతరం లక్షలాదిమంది భక్తుల కరతాళధ్వనుల మధ్య బిషప్ పతాకం ఆవిష్కరించి 11 రోజుల ఉత్సవాలకు నాంది పలికారు. ఈ వేడుకల్లో ఆలయ పాదర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన బిషప్‌లు పాల్గొని, విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లక్షలాది మంది భక్తులతో వేలాంకన్ని దివ్యక్షేత్రం కిటకిటలాడుతోంది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించారు. రద్దీలో దొంగల బారిన పడకుండా, పిల్లలు తప్పిపోకుండా అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధానాంశంగా సెప్టెంబరు 7వ తేది పునీత వేలాంకన్ని మేరీమాత అమ్మవారిని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన రథంలో ఊరేగించనున్నారు. మరుసటిరోజు అమ్మవారి జయంతి సందర్భంగా పట్టాభిషేకం, ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 3,500 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

బిసెంట్‌నగర్‌లో... స్థానిక బిసెంట్‌నగర్ సెయింట్ వేలాంకన్ని చర్చిలో మైలాపూర్ బిషప్ జార్జ్ ఆంథోనిస్వామి శుక్రవారం పతాకం ఆవిష్కరించి 53వ వార్షికోత్సవాలను ప్రారంభించారు. సెప్టెంబరు 8వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో పాల్గొననున్న భక్తుల సౌకర్యార్థం ఎంటీసీ సంస్థ ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి అర్థరాత్రి 12 గంటల వరకు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి అదనంగా సిటీ బస్సులు నడపనుంది. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన అమ్మవారి భక్తులు ఉదయం నుంచే పాదయాత్రగా బిసెంట్‌నగర్‌కు పెద్దసంఖ్యలో చేరుకొని భక్తిశ్రద్ధలతో ఆరోగ్యమాతను సేవించారు. సెప్టెంబరు 7వ తేది ఆరోగ్యమాతను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన రథంలో ఊరేగించనున్నారు. మరుసటిరోజు అమ్మవారి జయంతిని పురస్కరించుకొని పట్టాభిషేకం, ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇదిలా వుండగా సుమారు 1,500 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

గణపయ్యా.. పోయిరావయ్యా!



పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తొలివిడత వినాయక నిమజ్జనం శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వినాయక చవితి పండుగను కోలాహలంగా జరుపుకున్న విషయం తెలిసిందే. కొన్ని చోట్ల అదే రోజు సాయంత్రం ప్రతిమలను జలాశయాల్లో నిమజ్జనం చేశారు. హిందూ సంస్థలు, యువజన సంఘాలు తమ తమ వీధుల్లో సుమారు పదడుగుల ఎత్తైన వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. ప్రతిమలు ఏర్పాటు చేసిన పందిళ్ల సమీపంలో ప్రతిరోజూ భరతనాట్యం, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం 3, 5, 9 రోజుల్లో జలాశయాల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఆ ప్రకారం, నగరం, శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు శ్రీనివాసపురం, పట్టినంబాక్కం బీచ్, కాశిమేడు చేపలరేవు ప్రాంతం, తిరువొత్తియూరులోని పాపులర్ వెయ్యింగ్ స్టాండ్ వెనుక వైపు ఉన్న సముద్రతీరం, తిరువొత్తియూరులోని యూనివర్శల్ కార్బొరెండ్రం ఫ్యాక్టరీ వెనుక వైపున్న సముద్రతీరం, పళకలైనగర్ నీలాంగరై బీచ్ ప్రాంతాలు ఎంపిక చేశారు. ఈ ప్రాంతాల్లో తీరం నుంచి నీటి వరకు ప్రతిమలు తీసుకెళ్లేలా చెక్కలతో బాట ఏర్పాటు చేశారు. దీంతో పాటు ప్రతిమలను నీళ్ల వద్దకు తీసుకెళ్లేలా క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో, మూడవ రోజైన శుక్రవారం చెన్నై నుంచి సుమారు 100 ప్రతిమలను నిమజ్జనం చేశారు. ప్రతిమలను ప్రత్యేక వాహనంలో ఉంచి బ్యాండు మేళం, డీజేల మధ్య ఊరేగింపుగా నిమజ్జనం ప్రాంతాలకు తీసుకొచ్చారు. అక్కడ వరుసగా ఒక్కో ప్రతిమనలు ఉద్యోగులు నీళ్లలో ముంచి నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదవ రోజైన ఆదివారం పెద్దసంఖ్యలో ప్రతిమలు నిమజ్జనానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.





ఫైర్ కమిషన్ తొలి చైర్మన్‌గా

శంకర్ జివాల్



డీజీపీ పదవిలో ఉండగానే నియామకం

- 6లో -

రేపు జుసేసు ఆధ్వర్యంలో ...

ఆరోగ్య, రక్తదాన శిబిరం

- 7లో.. -

భావితరాలకు తరగని నిధులు

● భువనచంద్ర సాహిత్యాన్ని కొనియాడిన ప్రముఖులు



భువనచంద్రకు సత్కారం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర సాహిత్యం ఎంతో విలువైనదని, ఆయన తన జీవితమే సాహిత్యంగా ఆవిష్కరించుకున్న గొప్ప మానవతా వాది అని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కొనియాడారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో 'భువనచంద్ర సాహితీ సాగరం - సృజనాత్మక హరివిల్లు' పేరుతో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం విజయవంతంగా ముగిసింది. మెరీనా ప్రాంగణంలో సాయంత్రం జరిగిన సమాపనోత్సవానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ.. భువనచంద్ర జీవితం ఆదర్శనీయమైనదని కొనియాడారు. ఆయన 'పద్మశ్రీ' అవార్డుకు అర్హులన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. ఏ కాలంలోనైనా కాలం కంటే కవి ముందుంటాడని, అప్పటి ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రతిధ్వనిస్తుంటాడని.. అలాంటివారే భువనచంద్ర అని అన్నారు. గౌరవ అతిథి ఎం.వెంకటాద్రి శేషయ్య మాట్లాడుతూ.. సాహిత్య ప్రయోజనం, భాషా ప్రయోజనం చక్కగా గుర్తెరిగిన కవి భువనచంద్ర అని అన్నారు. ప్రత్యేక అతిథి జేఎం నాయుడు మాట్లాడుతూ.. భువనచంద్ర ఎంతటి కష్టమైన పనైనా ఇష్టంగా మలచుకుని తన జీవితమే సాహిత్యంగా ఆవిష్కరించుకొన్న గొప్ప మానవతావాది అని అన్నారు. 'నా జీవితం మళ్లీ మొదలైతే కొన్ని క్షణాలు మళ్లీ దాచుకుంటాను. కొన్ని క్షణాల్ని దూరంగా విసిరేస్తాను' అంటూనే 'కాలం నా బానిస. ఎందుకో తెలుసా? కాలం నా శరీరాన్నే శాసించగలదు, నా ఆత్మను కాదు' అని సగర్వంగా ప్రకటించుకున్న కవి, రచయిత, పాటల పెన్నిధి అని కొనియాడారు. ఈ తరం కవులకు, రచయితలకు ఆదర్శనీయుడని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథి వి.వి జయేంద్రరావు మాట్లాడుతూ.. భువనచంద్ర ప్రఖ్యాత భారతీయ రచయితగా, అనేక రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా, నటుడిగా, అన్నిటికీ మించి భారతీయ వైమానికదళంలో తన అత్యున్నత సేవలందించారని పేర్కొన్నారు. వివిధ ప్రసిద్ధ సంస్థల నుంచి ఆయన ఎన్నో పురస్కారాలను అందుకున్నారని గుర్తు చేశారు. మరో ఆత్మీయ అతిథి డాక్టర్ ప్రభల జానకి మాట్లాడుతూ.. భువనచంద్ర కథలు అమ్మ పెట్టే గోరుముద్దలు, మామ్మ పాడే జోలపాటలు, నాన్న తెచ్చే తాయిలాలు, భావితరాలకు తరగని నిధులు అనడంలో సందేహం లేదన్నారు. సమాపనోత్సవ సందేశం అందించిన డాక్టర్ మంగిపూడి రాధిక మాట్లాడుతూ.. భువనచంద్ర రాసిన ప్రతి రచన ఒక ఆణిముత్యం, ఆధునిక సాహిత్య రచయితల్లో ఆయనే ఒక ఆణిముత్యం అని ప్రశంసించారు. 'సున్నితంగా సమాజ మూలాల్ని స్పృశించి, రచనల్ని మనకి అందించే రచయిత. అనురాగంతో తన కలంతో ప్రేమ స్వరూపాన్ని ఆవిష్కరింపజేసే భావకుడు, రాసిన ప్రతి పదం పాఠకులకు అర్థమయ్యే రీతిలో రాసే తత్వజ్ఞాని' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చివరిగా భువనచంద్ర మాట్లాడుతూ.. తనకు, తన సాహిత్యానికి ఇంతటి అదృష్టం కలిగినందుకు ఆచార్య విస్తాలికి, మద్రాస్ వర్సిటీ తెలుగుశాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా వుండగా 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' వారు భువనచంద్రకు, మద్రాస్ వర్సిటీ తెలుగుశాఖకు సర్టిఫికెట్‌ను అందించారు. సమాపనోత్సవానికి ముందు జరిగిన పలు సమావేశాల్లో పలువురు పరిశోధకులు, రచయితలు పత్ర సమర్పణ చేశారు. ఆయా సమావేశాలకు అధ్యక్షత వహించినవారికి, పత్ర సమర్పకులకు, నగల ప్రముఖుల చేతుల మీదుగా సత్కరించారు.

ఆ గ్రామంలో పురుషులే ఎందుకు చనిపోతారు?

మౌలిక సదుపాయాల్లో వ్యూహాత్మక పెట్టుబడి

- డిప్యూటీ సీఎం ఉదయనిధి -

- వివరాలు 7లో -

సమాచార దర్శిని

నేడు 'నలం కాక్కుం స్టాలిన్' వైద్య శిబిరం

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మనలిలో శనివారం 'నలం కాక్కుం స్టాలిన్' వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈనెల 2వ తేది తేనాంపేట మండలం శాంతోమ్ సెయింట్ బీడ్స్ మహోన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఈ నెల 23వ తేది ఆలందూర్ మండలంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. మనలి మండలం పరిధిలో ఎవర్ విన్ విద్యాశ్రమం పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో జనరల్, ఎముకలు, గుండె, నరాలు, బీపీ, మధుమేహం సహా 17 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించనున్నారు.

నేడు 'తెలుగు వాగ్గేయకారుల సంగీత వైభవం'

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ఆధ్వర్యంలో శనివారం 'తెలుగు వాగ్గేయకారుల సంగీత వైభవం' పేరుతో త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు కీర్తనల కార్యక్రమం జరగనుంది. సాయంత్రం 4.30 గంటల నుంచి స్థానిక టి.నగర్ ఉస్మాన్ రోడ్‌లో వున్న ఆర్‌కేఎం శారద విద్యాలయలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు గ్రేడ్-1 వోకల్ ఆర్టిస్ట్ బి.రఘునాథ్ బృందం కీర్తనలు ఆలపించనుంది. సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి కార్యదర్శి కె.లక్ష్మీమోహన్‌రావు స్వాగతం పలుకనున్నారు. అరుణ శ్రీనాథ్ ప్రార్థన గీతం ఆలపించనుండగా, కె.రమాదేవి గానబృంద పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు 'నెల నెలా వెన్నెల' విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమం 'నెల నెలా వెన్నెల' ఈనెల 31న ఆదివారం జరగనుంది. ఇటీవల నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నారు.మైలాపూర్ లజ్ చర్చిరోడ్‌లో వున్న ఆంధ్ర మహిళా సభలో ఉదయం 10.30 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి స్మారక సమితి అధ్యక్షుడు డాక్టర్ అజంతా కె.శంకరరావు అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, ఐఆర్ఎస్ అధికారి సమత ముళ్లమూడి హాజరు కానున్నారు. డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల తెలుగు సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కల్పన సభా నిర్వహణ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు 'తెలుగు సినిమాలలో మనసు పాటలు'

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 164వ ప్రసంగం ఆదివారం జరగనుంది. స్థానిక టి.నగర్ విజయరాఘవ రోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి 'తెలుగు సినిమాలలో మనసు పాటలు' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలోని ఖాళీ పోస్టులను ఆయా జిల్లా కలెక్టర్లు ఇంటర్వ్యూల ద్వారా నిబంధనలకు లోబడి భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై రెవెన్యూ నిర్వహణ కమిషనర్‌కు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అముద సర్క్యులర్ పంపారు. అందులో... రెవెన్యూ శాఖలోని అన్ని జిల్లాల్లో మూడేళ్లుగా ఖాళీగా ఉన్న కార్యాలయ అసిస్టెంట్ పోస్టులను జిల్లా కలెక్టర్లు ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. పోస్టుల భర్తీలో ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసి, ఆ జాబితాను ప్రభుత్వానికి పంపించాలని సర్క్యులర్‌లో తెలిపారు.

'పింక్' ఆటోలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'పింక్' ఆటోలు పొందేందుకు చెన్నై జిల్లాకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంలో తొలివిడతగా 250 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా, మార్చి 8వ తేది సీఎం స్టాలిన్ ఆటోలు అందించారు. ప్రస్తుతం, ఈ పథకంలో సీఎన్‌జీతో నడిచే ఆటోలు అందించనున్నారు. చెన్నై జిల్లాకు చెంది, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 20 నుంచి 45 ఏళ్లలోపున్న మహిళలు దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్లను 'చెన్నై జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, 8వ అంతస్తు, సింగారవేలర్ భవనం, చెన్నై-600001' అనే చిరునామాకు సెప్టెంబరు 15వ తేదిలోపు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

మద్రాస్ ఐఐటీలో 'ప్రభుత్వ' విద్యార్థులకు అవకాశం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'అందరికీ ఐఐటీ' పథకం కింద మద్రాస్ ఐఐటీలో బీఎస్ డేటా సైన్స్ చదువుకునేందుకు 28 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీ డైరెక్టర్ కామకోటి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఉద్యోగం చేసే వారికి ఐఐటీ కేంద్రంగా సాంకేతిక విద్యను అందుబాటులో తీసుకువచ్చేందుకు ఆన్‌లైన్‌లో అనేక కోర్సులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆ మేరకు గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఇచ్చేలా బీఎస్ డేటా సైన్స్ కోర్సును ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఐఐటీలో చదువుకునేందుకు చెన్నై నుంచి ఆరుగురు, కోయంబత్తూరు నంచి 8, కళ్లకుర్చినుంచి 3, మైలాడుదురైలో నుంచి ఒకరు, సేలం, విల్లుపురం జిల్లాల్లో ఇద్దరేసి, శివగంగ, వేలూరు జిల్లాల్లో ముగ్గురేసి విద్యార్థులు ఎంపికయ్యారు. కొంతమంది ప్లస్‌టూ చదువుతున్నారు. వారు వచ్చే ఏడాది ఈ కోర్సులో చేరే అవకాశముంది. బీఎస్ డేటా సైన్స్ చదువుకునేందుకు ఎంపికైన విద్యార్థులు మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష కంటే తక్కువ ఉన్నందున ఈ కోర్సు ఫీజులో 75 శాతం ఐఐటీయే భరిస్తుందని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జేఈఈ పరీక్ష లేకుండా, అండర్ గ్రాడ్యుయేషన్‌లో చేరవచ్చని, కాలేజీ విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఫైర్ కమిషన్ తొలి చైర్మన్‌గా శంకర్‌జివాల్

డీజీపీ పదవిలో ఉండగానే నియామకం ● కొత్త ఇన్‌ఛార్జి డీజీపీగా వెంకట్రామన్!

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నిమాపక శాఖలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర అగ్నిమాపక సంఘం (ఫైర్ కమిషన్) చైర్మన్‌గా శాంతి భద్రతల విభాగం డీజీపీ శంకర్ జివాల్ నియమితులయ్యారు.ఈ మేరకు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. కాగా శంకర్‌జివాల్ ఈ నెల 31న డీజీపీగా పదవీ విరమణ చేయనున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఆయన 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. మెకానికల్ ఇంజనీర్‌గా కెరీర్‌ను ప్రారంభించి కొన్నేళ్లు ప్రముఖ కంపెనీల్లో ఇంజనీర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఐపీఎస్ అధికారి అయ్యారు. మదురై, సేలం జిల్లాలకు ఎస్పీగా, తిరుచ్చి నగర కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ ఐజీగా పని చేశారు. కేంద్ర సర్వీసులోనూ ఎనిమిదేళ్లపాటు విధులు నిర్వహించారు. ఉత్తమ సేవలకు రెండు సార్లు రాష్ట్రపతి అవార్డులను అందుకున్నారు. 2023 జూన్‌లో శాంతి భద్రతల విభాగం డీజీపీగా నియమితులయ్యారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ పదవి నుంచి నేరుగా డీజీపీగా పదోన్నతి పొందారు. ఆయన డీజీపీ ఉండగానే అగ్ని మాపక సంఘం చైర్మన్‌గా నియమితులవడం విశేషం.

మూడున్నర దశాబ్దాలకు పైగా...

పోలీసుశాఖలో మూడున్నర దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన శంకర్ జివాల్ సేవలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో రాష్ట్రంలో బాణసంచా కర్మాగారాల్లో తరచూ ఏర్పడుతున్న ప్రమాదాలను నివారించే దిశగా అగ్నిమాపక శాఖలో పోలీసు శాఖలో ఉన్న పోలీసు కమిషన్‌లా ఫైర్ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు హోంశాఖను నిర్వర్తిస్తున్న సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు అగ్ని మాపక శాఖలో కొత్తగా ఏర్పరచిన ఫైర్ కమిషన్ తొలి చైర్మన్‌గా శంకర్ జివాల్‌ను నియమించారు. రాష్ట్రంలోని బాణసంచా కర్మాగారాల్లో తరచూ అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు సంభవించడం, పలువురు కార్మికులు మృతి చెందుతుండటంతో ఈ ప్రమాదాలను నిరోధించేందుకు ప్రత్యేకంగా ఫైర్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా ఆదివారం పదవీ విరమణ చేయనున్న శంకర్ జివాల్‌కు సహోద్యోగులందరూ ఎగ్మూరు రాజరత్నం స్టేడియంలో శుక్రవారం సాయంత్రం వీడ్కోలు పలికారు.

ఇన్‌ఛార్జి డీజీపీగా వెంకట్రామన్...

రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఇన్‌ఛార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి వెంకట్రామన్‌ను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేయనున్నట్లు సమాచారం. సాధారణంగా డీజీపీ పదవి ఖాళీ కావడానికి మూడు నెలలకు ముందు రాష్ట్రప్రభుత్వం సీనియారిటీ ప్రకారం ఆ పోస్టుకు అర్హులైన ఎనిమిదిమంది ఐపీఎస్ అధికారుల పేర్ల జాబితాను యూపీఎస్సీకి పంపాల్సి ఉంటుంది. ఆ జాబితాలో ఉన్నవారిలో ముగ్గురి పేర్లను ప్రతిపాదిస్తూ యూపీఎస్సీ జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమిస్తుంది. ఈ ప్రక్రియలోనే డీజీపీ పోస్టును భర్తీ చేయడం ఆనవాయితీ. అయితే రాష్ట్రప్రభుత్వం ఈ సారి రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీ ఎంపికకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపలేదు. రాష్ట్ర శాసనసభకు ఎనిమిది నెలల్లోగా ఎన్నికలు జరుగనున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తమకు సానుకూలంగా వ్యవహరించే వ్యక్తిని డీజీపీగా నియమించుకోవాలని భావిస్తుండటంతో కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియను చేపట్టలేదు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ డీజీపీ వెంకట్రామన్‌ను రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఇన్‌ఛార్జి డీజీపీగా నియమించనున్నట్లు సమాచారం.



శంకర్ జివాల్‌కు ఉత్తర్వులను అందిస్తున్న ముఖ్యమంత్రి

భద్రతా వలయంలో రిప్పన్ భవనం

● ధర్నా జరుగుతుందన్న సమాచారంతో ముందస్తు చర్యలు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కార్యాలయం రిప్పన్ భవనం ప్రాంగణంలో భారీ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టనున్నారనే వార్తలతో చర్యలకు ఉపక్రమించారు. జీసీసీ పరిధిలోని రెండు మండలాల్లో పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించే తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ పారిశుధ్య కార్మికులు జీసీసీ కార్యాలయం ఎదుట 13 రోజులు ధర్నా చేపట్టారు. అనంతరం, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో పారిశుధ్య కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం, పారిశుధ్య కార్మికులు మళ్లీ శుక్రవారం నుంచి ధర్నా చేపట్టనున్నారనే వార్తలతో భద్రత కట్టుదిట్టం చేశారు. కీల్పాక్కం డిప్యూటీ కమిషనర్ జెరీనా బేగం, ట్రిప్లికేన్ డిప్యూటీ కమిషనర్ జయచంద్రన్ సహా ఐదుగురు డిప్యూటీ కమిషనర్ల నేతృత్వంలో 500 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. 20 ఎంటీసీ బస్సులు, మూడు అగ్నిమాపక వాహనాలు, 10 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు.



రిప్పన్ భవనంలో ప్రాంగణంలో పోలీసులు

చేపల వేటపై నిషేధం

● అంధియూరులో జాలర్ల ఆందోళన

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అంధియూరు మత్స్యకారులు వరట్టుపాళయం జలాశయంలో చేపలవేట సాగించకూడదంటూ జిల్లా కలెక్టర్ నిషేధం విధించడంతో ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం తమ ఊరిలోని ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేయడమే కాకుండా చేత నల్లజెండాలు పట్టుకుని నిరసన ర్యాలీ జరిపారు. అంధియూరులో వందకు పైగా మత్స్యకారుల కుటుంబాలు నివసిస్తున్నారు. సుమారు 600 మంది మత్స్యకారులు ఓ సంఘం ఏర్పాటు చేసుకుని వరట్టుపాళయం డ్యాం చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో చేపలవేట సాగిస్తుండేవారు. ఆ డ్యాంలో చేపలుపట్టే లీజు గడువు గత జూలై 2న ముగిసింది. ఈ నేపథ్యంలో డ్యాం తంథై పెరియార్ అభయారణ్యం పరిధిలో ఉందని ప్రకటించి జిల్లా కలెక్టర్ చేపలపట్టకూడదంటూ నిషేధ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని ఖండిస్తూ మత్స్యకారులు గత నెల రోజులుగా వివిధ రకాల ఆందోళనలు జరుపుతూ వచ్చారు.



అంధియూరు గ్రామంలో ఇళ్లపై ఎగురుతున్న నల్లజెండాలు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సిద్ధ వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్, అన్నదాన సాయిబాబా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పొలిచ్చలూరు అన్నదాన సాయిబాబా ఆలయంలో సిద్ధ వైద్య ఉచిత శిబిరం ఏర్పాటుచేశారు. గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ నిర్వాహకుడు పీఆర్ఎస్ శరవణ రాజ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా 324 1సి లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ బోస్, శ్రీ అన్నదాన సాయిబాబా ఆలయ ట్రస్టీ నటరాజన్ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎన్.కన్నన్ పర్యవేక్షించగా, జాతీయ సిద్ధ వైద్య పరిశోధన సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సెందిల్‌వేల్ నేతృత్వంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధనశేఖరన్, తాలూకా అధ్యక్షుడు అంథోని, నిర్వాహకులు రవిశంకరన్, అన్నామలై, చెల్లప్ప, శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓ దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ వితరణ చేశారు.

రెండాకుల కేసు: ఎన్నికల సంఘానికి ఢిల్లీ హైకోర్టు నోటీసు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రెండాకుల గుర్తుకు సంబంధించిన కోర్టు ధిక్కార కేసుపై స్పందించాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. అన్నాడీఎంకే మాజీ నిర్వాహకుడు పుహళేంది దాఖలు చేసిన కేసులో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశం తర్వాత కూడా నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేసినందుకు కమిషన్‌పై కోర్టు ధిక్కార కేసు దాఖలైంది. కోర్టు ధిక్కార కేసుకు సంబంధించి స్పందించాలని ఎన్నికల సంఘానికి నోటీసు జారీ చేసిన హైకోర్టు, తదుపరి విచారణ 2026 జనవరి 23వ తేదీకి వాయిదా వేసింది.

వైగై నదిలో 'ఉంగళుడన్ స్టాలిన్' పథక దరఖాస్తులు

●అవి పరిష్కరించినవే : అధికారులు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): త్రిభువనం సమీపంలోని వైగై నదిలో 'ఉంగళుడన్ స్టాలిన్' పథక శిబిరాల్లో స్వీకరించిన దరఖాస్తులు పడి ఉండడం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 'ఉంగళుడన్ స్టాలిన్' పథక శిబిరాలు జరుగుతున్నాయి. ఈ శిబిరాల్లో పట్టా మార్పిడి, రేషన్ కార్డులు, మహిళా ప్రోత్సాహక నిధి సహా పలు పథకాలు పొందేందుకు ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. శిబిరాల్లో ప్రజలు అందజేసే దరఖాస్తులు 45 రోజుల్లో పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ ప్రకారం, శివగంగ జిల్లా త్రిభువనం తాలూకా పూవంది, కీళడి, కొందగై, నెల్‌ముడికరై, మడప్పురం తదితర ప్రాంతాల్లో ఉంగళుడన్ స్టాలిన్ శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని దరఖాస్తులు సమర్పించారు. ఈ క్రమంలో, గురువారం త్రిభువనం సమీపంలో వైగై నదిలో ఉంగళుడన్ స్టాలిన్ శిబిరంలో అందజేసిన దరఖాస్తులు కనిపించాయి. ఈ దరఖాస్తులు పరిశీలించిన కార్తీక్ అనే యువకుడు అధికారులకు సమాచారం అందించాడు. దరఖాస్తుల్లో అధిక శాతం పట్టా మార్పిడి కోరుతూ వచ్చినవిగా ఉన్నాయి. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని దరఖాస్తులను పరిశీలించారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ అధికారులు మాట్లాడుతూ... ఆ దస్తావేజులు అన్నీ పరిష్కారమయ్యాన్నారు. దరఖాస్తులు నదిలో ఎవరు వేశారు అనే విషయమై విచారణ చేపట్టినట్లు తెలిపారు.



వైగై నదిలో లభించిన దరఖాస్తులు

గర్భిణిని చేసి మోసం చేశాడు!

అడయార్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భిణిని చేశాడంటూ నటుడు మాదంపట్టి రంగరాజ్‌పై ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ జాయ్ కిరిసిల్డా ఆరోపించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం చెన్నై నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ... మాదంపట్టి రంగరాజ్ మాదంపట్టి కేటరింగ్ సంస్థను నడుపుతుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు తనతో పరిచయం ఏర్పడిందన్నారు. ఆ తర్వాత చెన్నైలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకుని ఒకే ఇంటిలో కాపురం ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తాను ఆరు నెలల గర్భిణిని అని, ఈ నేపథ్యంలో తనను వదిలివెళ్ళిపోయారని పేర్కొన్నారు. తనను పెళ్లి పేరుతో మోసం చేశారని, అందువల్ల ఆయనపై తగిన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.



జాయ్ కిరిసిల్డా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ పేర్కొంది. **గిండి:** ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఈకాట్టుతాంగళ్, గాంధీ నగర్, పూందమల్లి రోడ్డు, జేఎన్ రోడ్డు, అంబాళ్ నగర్, లేబర్ కాలని, పిళ్లతయార్ ఆలయం 1 నుంచి 5 వీధులు, ఏ నుంచి డీ బ్లాక్, పూమగళ్ వీధి, సౌత్ ఫేస్, మౌంట్ రోడ్డు, బాలాజి నగర్, భారతియార్ వీధి, ధనకోటి రాజా వీధి, అచ్యుతన్ నగర్, మునుస్వామి వీధి. **పోరూర్:** ఈవీపీ సంతోష్ నగర్, కృష్ణా నగర్, లలిత నగర్, రాజేశ్వరి అవెన్యూ, ముత్తు నగర్, మాక్స్‌వర్త్ నగర్, బంగళాతోపు, మాదా నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి. **ఇంజంబాక్కం:** పీజే థామస్ అవెన్యూ అన్నా ఎన్‌క్లేవ్, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, సాయిబాబా ఆలయ వీధి, ఆలివ్ బీచ్ హనుమాన్ కాలని, క్లాసిక్ ఎన్‌క్లేవ్, రాజన్ నగర్, సెల్వ నగర్, ప్రార్థన పార్క్ అవెన్యూ, రాయల్ ఎన్‌క్లేవ్, వెట్టువాంకేని 1,2 అవెన్యూలు, స్వస్తిక్ అవెన్యూ, జీజీ గార్డెన్, చిన్నాండికుప్పం, శరవణ నగర్, చేరన్ నగర్.

కీల్పాక్కం: పూందమల్లి హైరోడ్డు, శాస్త్రి నగర్, పుల్లారెడ్డిపురం, ఓలంకుళం, న్యూ భూపతి, ఫ్లవర్స్ రోడ్డు, తంబుస్వామి వీధి, గెంగురెడ్డి రోడ్డు. **తిరువేర్కాడు:** పరుదిపట్టు, కొలడి, పెరుమాళగరం, వేలప్పన్‌చావిడి, మాదరవేడు, కో-ఆపరేటివ్ నగర్, షణ్ముగ నగర్, పులియంబేడు, పీహెచ్ రోడ్డు, నూంబల్, పారివాక్కం, కన్నపాళయం, కడువెట్టి, వీరరాఘవపురం, కుప్పుస్వామి నగర్, భారతి నగర్. **ఐటీ కారిడార్:** పెరుంగుడి ఇండస్ట్రియల్ ఎస్టేట్, బర్మా నగర్, వెంకటేశ్వర నగర్, సీవరం, కెనాల్ పురం, బాలమురుగన్ గార్డెన్, సెక్రటరీయేట్ కాలని, నీలాంగరై లింక్ రోడ్డు, కస్టమ్స్ కాలని, రాజీవ్ గాంధీ రోడ్డు, పంచాయతి రోడ్డు, ఎలిమ్ నగర్, కందన్ చావిడి, సంతోష్ నగర్, పాల్‌రాజ్ నగర్, వీరమామునివర్ రోడ్డు, ఇళంగో నగర్, కామరాజ్ వీధి, గాంధీ వీధి, పెరియార్ రోడ్డు, గోవిందన్ నగర్, పాలవాక్కం కెనాల్ రోడ్డు, కజురా గార్డెన్, రంగారెడ్డి గార్డెన్, చిన్న నీలాంగరైకుప్పం, కపాలీశ్వరర్ నగర్, సౌత్ అండ్ నార్త్ పాండియన్ రోడ్డు, వైద్యలింగం రోడ్డు, సీఎల్ఆర్ఐ నగర్, రాజి కాంప్లెక్స్.

పారివాక్కం: కన్నపాళయం, ఒలిచేరి, పిడారి తాంగళ్, భానవీడు తోట్టం, కొలప్పన్‌చేరి.

శివగంగలో బీజేపీ నేత దారుణహత్య



బీజేపీ నేత సతీష్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శివగంగ పోలీసు క్వార్టర్స్‌లో నివసిస్తున్న బీజేపీ నగర శాఖ వాణిజ్య విభాగం నాయకుడు సతీష్(51) శుక్రవారం వేకువజామున మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాలో దారుణహత్యకు గురయ్యాడు. శివగంగ వారపు సంత లో సతీష్ మోటరు సైకిల్ మెకానిక్ దుకాణం నడుపుతున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. దుకాణాన్ని మూసి వేసి రాత్రిపూట స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండేవాడు. ఆ ప్రకారమే గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా అదే సమయంలో డప్పులు వాయించే బృందానికి చెందిన కొందరు సతీష్ వద్దకు వచ్చి వెంట తెచ్చుకున్న మద్యం తాగారు. మత్తు అధికం కావటంతో ఇరువర్గాలకు చెందినవారు దుర్భాషలాడుకున్నారు. దీనితో డప్పులు వాయించే బృందానికి చెందిన కొందరు సతీష్ వర్గీయులపై దాడికి దిగారు. సతీష్ స్నేహితుడు మణిభారతిపై దాడిని సతీష్ అడ్డుకున్నాడు. దీంతో ఆగ్రహించిన ప్రత్యర్థులు సతీష్‌పై దాడి జరపటంతో ఆయన నేలపై పడ్డాడు. వెంటనే ఆయన్ను శివగంగ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే సతీష్ ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. ఇక గాయపడిన మణిభారతి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్‌లో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ విలీనం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో అంతర్జాతీయ స్థాయిలో నేత్ర వైద్య చికిత్సలందించడంలో పేరుగడించిన డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (ఏహెచ్‌సీఎల్) సంస్థలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ లిమిటెడ్ (ఏఈహెచ్ఎల్)లో విలీనమైంది. ఈ మేరకు గురువారం జరిగిన ఆ రెండు కంపెనీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు ఏహెచ్‌సీఎల్ సీఈఓ డాక్టర్ అదిల్ అగర్వాల్ ప్రకటించారు. అంతే కాకుండా సుమారు రూ.70 కోట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూలను జారీ చేయడానికి కూడా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం ఆమోదించినట్లు తెలిపారు. అదే విధంగా 1,32,827 ఈక్విటీ వాటాలను ఒక్కో షేర్‌కు రూ.5270 ఇష్యూ ధరతో జారీ చేయాలని కూడా నిర్ణయించినట్లు వివరించారు. ఈ విలీనం కారణంగా రోగులకు మరింత విస్తృతమైన నేత్రవైద్య సేవలను అందించడానికి వీలుపడుతుందని, సంస్థ కార్యక్రమాల విస్తరణ కూడా జరుగుతుందని ఆయన తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



నేత్రదానంపై రోడ్‌షో నిర్వహిస్తున్న వైద్యకళాశాల విద్యార్థులు

వేలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కలిగేందుకు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో వైద్యకళాశాల విద్యార్థులు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యకళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ... శుక్రవారం తమ కళాశాల ఆధ్వర్యంలో 40వ దేశీయ నేత్రదాన అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. మనిషి మరణించిన అనంతరం మరొకరికి పునర్జన్మనిచ్చే అవకాశాన్ని దేవుడు మనకిచ్చాడన్నారు. ప్రతి ఒక్కరు మరణానంతరం నేత్రదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపల్ రోహిణిదేవి, నేత్రదాన సొసైటీ నిర్వాహకులు విజయ్, తాహసీల్దారు వడివేలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

తిరుత్తణి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి యూనియన్ పట్టణాభివృద్ధి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.11.65 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులను శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా పొదట్టూరుపేట సమీపంలోని తెక్కలూరులోని జాతీయ రహదారిపై రూ.12 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డును ఆయన పరిశీలించి సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్నకదంపూర్ పంచాయతీలో రూ.140 కోట్లతో నిర్మిస్తున్న ఉచిత ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గ్రామీణాభివృద్ధి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోవేందన్, గోమతి, ధర్మేష్, జాతీయ రహదారులశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సేన్, జిల్లా డెవలెప్‌మెంట్ అధికారులు సంతానం, కుమారు సహా పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

బస్సు బోల్తా :12 మందికి తీవ్రగాయాలు

తిరుత్తణి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు అడిగల్పట్టు ప్రాంతానికి చెందిన 8 మంది మహిళలు సహా 12 మంది కార్మికులు కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూర్‌లోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోజులాగే వారందరూ ఫ్యాక్టరీ బస్సులో బయలుదేరగా, ఆరుంగళం ప్రాంతం వద్ద బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 12 మందికి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కార్మికులను అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన బస్సు

నిమజ్జన వేడుకల్లో మహిళలు

తిరుత్తణి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని కొల్లాపురి అమ్మవీధిలో మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గత మూడు రోజుల పాటు నిర్విరామంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో స్థానిక మహిళలు పాల్గొని ఉత్సాహంగా స్టెప్పులేసి సందడి చేశారు.



వినాయక నిమజ్జనంలో మహిళలు

విద్యార్థుల మధ్య ఘర్షణలు

మనోన్మణియం వర్సిటీ నిరవధికంగా మూసివేత

అడయార్, ఆగస్టు 29: తిరునెల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణల కారణంగా వర్సిటీని నిరవధికంగా మూసివేశారు. నెల్లై - తెన్‌కాశి జాతీయ రహదారి మార్గంలోని అభిషేకపట్టిలో ఈ వర్సిటీ ఉంది. ఇక్కడ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యాభ్యాసం చేసే విద్యార్థి ఒకరు నిషేధిత ప్రాంతానికి ద్విచక్రవాహనంపై రాగా, అదే సమయంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఈ విషయాన్ని ప్రస్తావించాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడగా, వర్సిటీకి చెందిన విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణలకు దిగారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలు చెలరేగడంతో ముందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వర్సిటీని నిరవధికంగా మూసివేశారు.



ఊటీ రహదారిలో వరదలా ప్రవహిస్తున్న వాననీటిలోనే వెళుతున్న ఆటో

నీలగిరి జిల్లాలో కుండపోత

● దీవులుగా మారిన పల్లపు ప్రాంతాలు ● ఇళ్లలోకి వర్షపు నీరు

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు కురిసిన వర్షానికి గూడలూరు, పందలూరు పరిసర ప్రాంతాల్లో వరద దృశ్యాలు నెలకొన్నాయి. పల్లపు ప్రాంతాలు దీవులుగా మారాయి. గూడలూరులోని ప్రధాన రహదారుల్లో మోకాలిలోతు వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. పాడంతురై - అలవాయల్ మెయిన్ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. ఆ మార్గంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితులు దాపురించాయి. ఈ వర్షాలకు దేవలా ప్రాంతం వద్ద సుందరలింగం అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలింది. ఆ ఇంటి శిథిలాల మధ్య చిక్కుకుని అతడి భార్య చంద్రిక (50) గాయపడ్డారు. చుట్టుపక్కలి వారి ఆమెను వెలికి తీసి ఊటీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే విధంగా ముత్తులింగం అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూడా కూలింది. ఊటీలోనూ మోస్తరు వర్షాలు కురిశాయి. అదే సమయంలో పలు ప్రాంతాల్లో దట్టమైన మంచు అలముకుంది. ప్రభుత్వ అధికారులు వర్షబాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఐదు రోజులు మోస్తరు వర్షాలు

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం నుంచి సెప్టెంబరు 3వ తేది వరకు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. దక్షిణ భారత ప్రాంతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. అదే సమయంలో పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో భారీ వర్షం, గంటకు 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో స్వల్ప వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది. ఇక పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 26-27 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

గిడుగు వెంకట రామమూర్తి సేవలు చిరస్మరణీయం

● కార్యక్రమంలో వక్తలు

ప్యారీస్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఎస్‌కేపీసీ), ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం తెలుగు భాషా దినోత్సవం, గిడుగు వెంకట రామమూర్తి 162వ జయంతిని పురస్కరించుకుని తెలుగు భాష ప్రాముఖ్యతపై అవగాహన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) మాజీ సభ్యులు ఊరా అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఊరా అంజనేయులు సభనుదేశించి మాట్లాడుతూ... గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషకు మహత్తర కృషిచేశారని, తెలుగును గ్రాంథిక భాషనుంచి అందరికి అర్థమయ్యేలా సాధారణ వ్యవహారిక భాషగా మార్చారని వివరించారు. రాష్ట్రంలోని తెలుగువారంతా తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వీబీ.వనిత, వైస్ ప్రిన్సిపల్ ఎన్.వీ.నప్పినై, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భరణికుమారి, తెలుగు విభాగాధిపతి మైథిలి, కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు



జనని సంస్థ ఆధ్వర్యంలో చెన్నై భారతి నగర్‌లో జరిగిన మహాకవి గిడుగు రామమూర్తి 162వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ అధ్యక్షురాలు నిర్మలా పళనివేలు, వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్య, తెలుగు ప్రముఖులు యర్రభనేని పట్టాభిరామయ్య, యిమ్మిడి శెట్టి కోటేశ్వరరావు

రేపు జనసేన ఆధ్వర్యంలో ...
ఆరోగ్య, రక్తదాన శిబిరం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి సిమ్స్ సహకారంతో ఆ పార్టీ చెన్నై విభాగం ఈనెల 31వ తేదీన (ఆదివారం) స్థానిక టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్, గోదావరి హాలులో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మెగా ఆరోగ్య, రక్తదాన శిబిరాల్ని నిర్వహించనుంది. గత యేడాది నిర్వహించిన ఈ తరహా కార్యక్రమం విజయవంతమైన విషయం తెలిసిందే. దాని కొనసాగింపుగా ఈ యేడాది కూడా ఈ తరహా వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా మధుమేహం, థైరాయిడ్, ఈసీజీ, కంటి మరియు ఈ.ఎన్.టి. పరీక్షలు చేయనున్నారు. అలాగే రక్తదాన శిబిరం కూడా నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో స్విమ్స్ ఆస్పత్రికి చెందిన కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, ఈ.ఎన్.టి స్పెషలిస్ట్, జనరల్ ఫిజీషియన్ తదితర విభాగాల నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించడంతోపాటూ తగు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ఆస్కా పూర్వ అధ్యక్షుడు, పల్లవ గ్రానైట్ అధినేత డాక్టర్ కె.సుబ్బా రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రముఖ సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం గౌరవ అతిథిగా హాజరై వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించనున్నట్లు జనసేన పార్టీ చెన్నై కన్వీనర్ అరిగెల తమ్మయ్య నాయుడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నల్లకన్నుకు ఐసీయూలో కొనసాగుతున్న చికిత్స

● జీహెచ్‌లో కుటుంబీకులకు సీఎం పరామర్శ

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో చికిత్స పొందుతున్న కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు నల్లకన్ను కుటుంబీకులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరామర్శించారు. ప్రస్తుతం అత్యవసర చికిత్స విభాగం (ఐసీయూ)లో నల్లకన్నుకు వైద్యనిపుణులు చికిత్సలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం స్టాలిన్ ఆస్పత్రికి వెళ్లారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న నల్లకన్నును ఆ విభాగం ప్రధాన ద్వారం అద్దాల గుండా వీక్షించారు. ఆ తర్వాత అక్కడే ఉన్న నల్లకన్ను కుటుంబీకులను పరామర్శించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కె.ముత్తరసన్‌తో వివరాలను అడిగి పరామర్శించారు. స్టాలిన్‌తో పాటు మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ కూడా ఆస్పత్రికి వెళ్లి నల్లకన్ను ఆరోగ్య పరిస్థితులను వైద్యాధికారుల వద్ద అడిగి తెలుసుకున్నారు.



జీహెచ్‌లో నల్లకన్ను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న స్టాలిన్. ఐసీయూ గది తలుపుల అద్దం నుంచి నల్లకన్నును వీక్షిస్తున్న స్టాలిన్



విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల అద్భుత ప్రదర్శన

ప్యారీస్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని శ్రీ కనక దుర్గ తెలుగు మహోన్నత పాఠశాల (ఎస్‌కేడీటీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ఎస్‌కేడీటీ ప్రాథమిక పాఠశాల, డీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాల, సింగారం పిళ్లై పాఠశాల, కొళత్తూరు, విల్లివాక్కం పరిసర ప్రాంతాల్లోని 15 పాఠశాలల నుంచి సుమారు 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొని 40 ప్రదర్శనలతో తమదైన నైపుణ్యాన్ని చాటారు. ఉదయం 9 గంటలకు పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ పోటీల్లో ముఖ్యఅతిథి నార్త్ చెన్నై డీఈవో ఏఎస్.ఎలిల్ అరసి అంతర్ పాఠశాలల సైన్స్ ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలిల్ అరసి మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సైన్స్ ప్రయోగాలతో తమ మేధోశక్తికి పదును పెట్టారన్నారు. ఇదే విధంగా విద్యార్థులంతా ప్రయోగాత్మకంగా ఆలోచించి దేశానికి ఉపయోగపడాలని సూచించారు. అనంతరం 3.30 గంటలకు పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ సీఎం కిషోర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలో ఎంపికైన నీటి శుద్ధీకరణ యంత్రం, విమాన ప్రమాదాల్ని ముందుగా హెచ్చరించే యంత్రం, భూకంపాలను పసిగట్టే పరికరాలు తదితర నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.నందగోపాల్, డాక్టర్ ఎన్.నాగభూషణం, ప్రధానోపాధ్యాయురాలు శారా సుహాసిని, ఏహెచ్‌ఎం అలగర్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేఎన్ కేసరి, గిడుగు రామమూర్తి పంతులకు అంజలి ఘటిస్తున్న విద్యార్థులు

మైలాపూర్ కేసరి మహోన్నత పాఠశాలలో...

● ఘనంగా ఆంధ్ర భాషా దినోత్సవం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్ర భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ మాతృభాషా దినోత్సవంలో భాగంగా తొలుత పాఠశాల వ్యవస్థాపకులు కేఎన్ కేసరి, రామ్మూర్తి పంతులు చిత్ర పటాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి పుష్పమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా 12వ తరగతి విద్యార్థిని నాగలక్ష్మి రామ్మూర్తి పంతులు సాగించిన భాషోద్యమం గురించి చేసిన ప్రసంగం ప్రశంసలందుకుంది.

సురయ్యు జులైఖాకు 'ఫిట్‌నెస్ లెజెండ్' పురస్కారం



పురస్కార ప్రదానోత్సవం

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'ఫిట్‌నెస్' కోసం జీవితాంతం కృషి చేసిన ప్రముఖ ఫిట్‌నెస్ నిపుణురాలు సురయ్యు జులైఖాకు 'ది గుడ్ డీడ్స్ క్లబ్' 'దక్షిణ భారత ఫిట్‌నెస్ లెజెండ్' పురస్కారాన్ని ప్రదానం చేసింది. ప్రముఖ సామాజిక వేత్త అప్సర రెడ్డి నిర్వహించే 'ది గుడ్ డీడ్స్ క్లబ్' 'స్ట్రాంగ్ ఈజ్ ది న్యూ సెక్సీ' పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పలువురు నిపుణులు, క్లబ్ సభ్యులు, ఔత్సాహికులు హాజరయ్యారు. అదే విధంగా ఫిట్‌నెస్ నిపుణులు యాస్మిన్ కరాచీవాలా, షర్మిలీ కఫూర్ తదితరులు కూడా హాజరై శరీరబలం, క్రమశిక్షణ, రోజువారీ జీవితంలో స్థిరమైన ఫిట్‌నెస్ పద్ధతులపై సమగ్రంగా విశ్లేషించారు.

కోవైలో అట్టహాసంగా అమెరికా యువతి ప్రేమవివాహం



వధూవరులు సారా, గౌతమ్

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో కొడీసియా మైదానంలో అమెరికా యువతి, తమిళ యువకుడి ప్రేమ వివాహం ఇరువైపు కుటుంబీకులు, స్నేహితుల మధ్య అట్టహాసంగా జరిగింది. కోయంబత్తూరు నవ ఇండియాకు చెందిన మోహన్, ప్రేమలతా దంపతుల కుమారుడు గౌతమ్ (30) కెనడాలో ఉన్నత చదువులు చదివాడు. గౌతమ్ కాలేజీలో చదువుతున్నప్పుడు వాషింగ్టన్‌కు చెందిన సారా(30)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. 2019లో గౌతమ్ కాలేజీలో జరిగిన స్నాతకోత్సవానికి అతడి తల్లిదండ్రులు వెళ్లారు. ఆ సమయంలో గౌతమ్, సారా తమ ప్రేమ గురించి తెలిపారు. ఇరువురి ప్రేమకు గౌతమ్ తల్లిదండ్రులు, సారా తల్లిదండ్రులు ఒకే సారి పచ్చజెండా ఊపారు. అయితే ఓ నిబంధన విధించారు. ఇరువురూ పీజీ పూర్తి చేసి ఉద్యోగంలో చేరిన తర్వాతే వివాహం చేస్తామన్నారు. వారి మాట జవదాటకుండా ఆ ప్రేమ జంట పీజీ కోర్సులో ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులై ప్రస్తుతం కెనడాలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత పదిహేను రోజులుగా వీరి ప్రేమ వివాహానికి ఇరువైపు కుటుంబీకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. గురువారం సాయంత్రం కోయంబత్తూరు కొడీసియా మైదానంలో వీరి ప్రేమవివాహం అట్టహాసంగా జరిగింది.కెనడా నుండి వచ్చి సారా తరఫు కుటుంబీకులు, గౌతమ్ కుటుంబీకులు, బంధువులు, సన్నిహితులు వధూవరులను ఆశీర్వదించి విందు వినోద కార్యక్రమాల్లోనూ పాల్గొని సందడి చేశారు.

మౌలిక సదుపాయాల్లో వ్యూహాత్మక పెట్టుబడి

● ఉపముఖ్యమంత్రి ఉదయనిధి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఈవీ వేలు తదితరులు

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల్లో తమ ప్రభుత్వం వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో ఏర్పాటైన కోనెక్స్ సౌత్ ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించిన ఉదయనిధి మాట్లాడుతూ.. కన్నియాకుమారిలో రూ.37 కోట్లతో గాజు వంతెన వంటి మైలురాయి ప్రాజెక్టులను సవాలుతో కూడిన పరిస్థితుల్లో ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా రూ.640తో తేనాంపేట - సైదాపేట ఫ్లైఓవర్ చేపట్టామన్నారు. ఇది ఇప్పటికే ఉన్న మెట్రో సొరంగంపైన నిర్మించిన ప్రపంచంలోనే మొట్టమొదటి ఇంజనీరింగ్ ఘనతగా అభివర్ణించారు. ప్రజా పనుల శాఖ మంత్రి ఈవీ వేలు కూడా హాజరయ్యారు.గురువారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈనెల 30న శనివారం వరకు కొనసాగనుంది. దేశవ్యాప్తంగా 200కు పైగా ప్రముఖ బ్రాండ్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లు, టెక్నాలజీ ప్రొవైడర్లు, తయారీదారులు ఈ ప్రదర్శనకు హాజరయ్యారు.

12న తెరపైకి 'దుశ్శాదనన్'



'దుశ్శాదనన్'లో ఓ దృశ్యం

వివా ఫిలిమ్స్, వీజీ స్టూడియోస్, తాయ్ తిరైయరంగం సంయుక్తంగా నిర్మించిన 'దుశ్శాదనన్' చిత్రాన్ని సెప్టెంబరు 12న విడుదల చేయనున్నట్టు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వికాస్, సింగంపులి, తమిళ్ సెల్వి, మణిమారన్ తదితరులు ఈ చిత్రంలో నటించగా, కథ, స్ర్కీన్‌ప్లే, మాటలను సమకూర్చడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను దళపతి చేపట్టారు. బాలమురుగన్ ఛాయాగ్రహణం, విజయ్ ప్రభు సంగీతం అందించారు. సినిమాలో రెండు ఫైట్లు ఉండగా, రాకీ రాజేష్ స్టంట్స్ మాస్టర్‌గా పనిచేశారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు దళపతి వివరిస్తూ.. 'తమ పిల్లలు అడిగినవన్నీ తల్లిదండ్రులు కొనిస్తారు. చదివిస్తుంటారు. పాఠశాలల్లో చేరే విద్యార్థులకు సైన్స్ గణితం, కంప్యూటర్ ఇలా అన్ని సబ్జెక్టులను ఉపాధ్యాయులు బోధిస్తుంటారు. అయితే, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లలకు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని ఇవ్వడంలో, సాటి మనుషులతో ఎలా నడుచుకోవాలో నేర్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. నేడు సమాజంలో జరుగుతున్న అన్ని దారుణాలకు అనైతికతే కారణం. దాన్ని ప్రశ్నించినపుడు ఏమి జరుగుతుంది? పోలీసులు రంగ ప్రవేశం చేశాక ఎలాంటి పరిణామాలు జరిగాయన్నదే ఈ చిత్ర కథ' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

ఆ గ్రామంలో పురుషులే ఎందుకు చనిపోతారు?



'నరువి'లో ఓ దృశ్యం

నీలగిరి జిల్లా కున్నూరుకు సమీపంలోని ఓ గ్రామంలో కేవలం పురుషులు మాత్రమే చనిపోతుంటారు? అలా ఎందుకు మరణాలు సంభవిస్తున్నాయి... అనే కథాంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని నిర్మించిన చిత్రం 'నరువి. డాక్టర్ హరీష్ హీరోగా నటించారు. వీజే పప్పు, కేథరిన్, పడిన కుమార్ తదితరులు నటించారు. ఎం.సుబారక్ దర్శకత్వం వహించగా, నిర్మాత ఏ.అళగు పాండియన్ నిర్మించారు. ఈ చిత్ర వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'కున్నూరుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండే ఒక కుగ్రామంలో కేవలం పురుషులు మాత్రమే అంతుచిక్కని రీతిలో చనిపోతుంటారు. ఈ మరణాల్లోని రహస్యాన్ని తెలుసుకునేందుకు ఇద్దరు యువకులు, ముగ్గురు అమ్మాయిల బృందం ఆ గ్రామానికి వెళుతుంది. అక్కడకు చేరుకున్న తర్వాత గ్రామంలో ఏం కనుగొన్నారన్నదే చిత్ర కథ. పైగా ఈ బృందంలోకి ఒక యువతి మామ కూడా అదే గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, అదృశ్యమైపోతాడు. అతనికి ఏం జరిగిందో వారు అన్వేషిస్తారు. ఇందులో డాక్టర్ హరీష్ హీరోగా అద్భుతంగా నటించారు. సరైన రవాణా సౌకర్యాలు లేని, కొండ గ్రామానికి వెళ్లడం, అక్కడ చిన్నారులకు విద్యాబోధన చేసే పాత్రలో ఇమిడిపోయారు. ఈ చిత్రంలోని హీరోయిన్లలో ఒకరైన విస్సు పాత్ర గ్లామర్‌గా ఉంటుంది. అయితే, సినిమా క్లైమాక్స్‌తో ఆమె తీసుకునే నిర్ణయం దిగ్ర్భాంతికి లోనుచేస్తుంది. మదన్ ఎస్ రాజా టీ ఎస్టేట్ యజమానిగా, మృదువైన విలన్ పాత్రధారిగా నటించారు. ఇందులోని పాటలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయని, నేపథ్య సంగీతం కూడా చిత్రానికి అదనపు బలం. ఆధ్యాత్మిక అంశాలతో థ్రిల్లింగ్ హార్రర్ మూవీగా తెరకెక్కించామని, ఒక మంచి సందేశాన్ని అందించే మూవీగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు.

రవి మోహన్ ప్రతిభ ప్రపంచానికి తెలియాలి

● కెనిషా



కెనిషా, రవి మోహన్ తదితరులు

హీరో రవి మోహన్ ప్రతిభ ఈ ప్రపంచానికి తెలియాలని, ప్రజలు చూడాలని ప్రముఖ నేపథ్యగాయని కెనిషా ఫ్రాన్సిస్ అన్నారు. చెన్నైలో రవి మోహన్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగ్గా అందులో కెనిషా పాల్గొని ప్రసంగిస్తూ, 'నేను నేపథ్యగాయని. ఇండిపెండెంట్ సంగీత నృత్యకళాకారిణి. ఇపుడు రవి మోహన్ స్టూడియోలో భాగస్వామిని. ఈ అవకాశాన్ని కల్పించిన రవి మోహన్‌కు ధన్యవాదాలు. చాలాకాలంగా నేను ఒంటరిగా ఉంటున్నా. ఇపుడు రవి ద్వారా ఇంత మంది అందమైన మంచి మనుషులను చూడగలుగుతున్నా. ఈ స్టూడియోను మరింతగా విస్తరించాలని భావిస్తున్నా. అదే మా ఇద్దరి కల. ఇక రవి మోహన్ విషయానికి వస్తే, అతను ఎంతో క్లిష్టపరిస్థితిని ఎదుర్కొన్నారు. అతనిలో ఎంత బాధ ఉన్నప్పటికీ బయటకు చూపించరు. ఇపుడు రవికి చెందిన ఏడు స్ర్కిప్టులు నా వద్ద ఉన్నాయి. అతని ప్రతిభను ఈ ప్రపంచం చూడాలి. నాకు ఒక అత్యాశ కూడా ఉంది. రవి మోహన్‌లోని దైవ గుణాన్ని ఈ ప్రజలంతా చూడాలి. ఆ దేవుడుని నేను చూశా. విజయం సాధించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఆ విజయం కోసం ఆయన ఎంతగానో శ్రమించారు. రవి మోహన్ ఎంత మంచి వ్యక్తో ఆయన తల్లి వరలక్ష్మితో ఒక రోజు గడిపితే తెలుస్తుంది. అలాంటి మంచి వ్యక్తిని ఇచ్చినందుకు వరలక్ష్మీ అమ్మకు ధన్యవాదాలు' అన్నారు. కాగా, రవిమోహన్ స్టూడియో ప్రారంభోత్సవంలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, హీరోలు కార్తి, శివకార్తికేయన్, హీరోయిన్ జెనీలియా తదితరులు పాల్గొని విషెస్ చెప్పారు.

'వర్కర్'గా హీరో జై

హీరో జై నటించే కొత్త చిత్రానికి 'వర్కర్' అనే పేరు పెట్టారు. ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు కీలక పాత్రను పోషించనున్నారు. రీష్మా ననైయ హీరోయిన్. ఇతర పాత్రల్లో నాగినీడు, భరత్ కల్యాణ్, ప్రవీణ, శ్రీజ రవి, శశిలయ, వెంకట్ సెంగుట్టువన్ కనిపించనున్నారు. ప్రెజెంట్స్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. చిత్ర షూటింగ్ గురువారం సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. వినయ్ కృష్ణ దర్శకుడు. రియల్ ఎమోషనల్, ఆసక్తికరమైన కథాంశంతో ప్రేక్షకులను అలరించేలా సినిమా ఉంటుంది. షూటింగ్ చెన్నై, పాండిచ్చేరిలలో పూర్తి చేయనున్నాం' అని దర్శకుడు తెలిపారు. అంజి సినిమాటోగ్రఫీని అందించే ఈ చిత్రానికి శోభనా రాణి నిర్మాత. జిబ్రాన్ సంగీతం.



కొత్త చిత్రం ప్రారంభోత్సవ పూజా దృశ్యం



తిరుమలేశుడి సేవలో ఐశ్వర్యా రాజేష్


సినీ హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆమెను పలువురు సినీ అభిమానులు ఆసక్తిగా చూశారు. కొందరు సెల్ఫీలు దిగారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మే 15 కటాఫ్‌తో డీఎస్సీ అర్హత నిర్ణయించడం సరికాదు : ఆపస్

తిరుపతి(విద్య), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు మే 15 తర్వాత జారీ అయ్యాయనే కారణంతో వారిని అనర్హులుగా నిర్ణయించడం ఎంతమాత్రమూ సరికాదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ డీఎస్సీ ప్రకటన ప్రకారం మే 15వ తేదీకి ముందే పరీక్షలు రాసి, ఫలితాలు వెల్లడైన విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారికి మే 15 తరువాత సర్టిఫికెట్లు జారీ అయ్యాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నాటికి అర్హత కలిగిన వారందరికీ పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలామంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ అందలేదని, అందువల్ల ఎవరు ఏరోజున వెరిఫికేషన్‌కు రావాలో తెలియడం లేదని పేర్కొన్నారు. పోస్టింగులు ఇవ్వడానికి ముందే ప్రతి జిల్లాలో సబ్జెక్టు వారీగా రోస్టర్ కమ్ మెరిట్‌లో అభ్యర్థులకు సంబంధించిన మార్కులు రిజర్వేషన్ కేటగిరీ తెలిసేలా ఫైనల్ సెలెక్షన్ లిస్టులు ప్రకటించాలని కోరారు. అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 63,843

తలనీలాలు సమర్పించినవారు: 21,344

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

ఆదేశించిన టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్షించారు. అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి ఈఅంశంపై చర్చించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని తడి చెత్త ద్వారా బయోగ్యాస్, ఎరువులు తయారీకి టీటీడీ-ఐఓసీఎల్ భాగస్వామ్యంతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. విభజన అవసరం లేకుండా వ్యర్థాల నిర్వహణ సమర్థ అమలుకు పద్ధతులను అన్వేషించాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ శాస్త్రవేత్త, పద్మశ్రీ గ్రహీత శరద్ ఖలే, బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడం పర్యావరణ అనుకూల పరిష్కారమని పేర్కొన్నారు. త్వరలో టీటీడీకి అనువైన ప్రణాళికను అందజేస్తానన్నారు. కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. సమీక్షలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ సుధాకర్, డిప్యూటీఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, శాస్త్రవేత్తలు సందీప్ అసోలేకర్, బౌ నిపుర్తే తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ ప్రకియను ప్రదర్శిస్తున్న శరద్ ఖలే

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



తూపిలిపాళెం తీరంలో భారీ ఏర్పాట్ల మధ్య నిమజ్జనోత్సవం

వాకాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతల మధ్య శుక్రవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో గణేష్ నిమజ్జనోత్సవం జరిగింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ట్రాక్టర్లు, మినీట్రక్కులు, ట్రాలీ ఆటోలు, లారీల ద్వారా వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, ఒక భారీ క్రేన్, బోట్లను, గజఈతగాళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. గంగన్నపాళెం సర్పంచి మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. 115 మందితో బందోబస్తు చేపట్టినట్లు సీఐ హుస్సేన్‌బాబు తెలిపారు. లైట్‌హౌస్, తూపిలిపాళెం సముద్రతీరాలలో 224 గణపతి ప్రతిమలతో భక్తులు నిమజ్జనం చేశారు. వాకాడు, కోట చిట్టమూరు ఎస్‌ఐలు నాగబాబు, పవన్, బలరామయ్య, డీటీ రఫీ సయ్యద్, ఆర్‌ఐ అఖిల్ తదితరులున్నారు.

ఎస్వీయూ ఎల్‌ఎల్‌బీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఒకటి వాయిదా పడింది. సెప్టెంబరు 5వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ లా (వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్) పరీక్ష నిర్వహించాలని భావించారు. అయితే అదే రోజున మిలద్-ఉన్-నబీ పండుగ కారణంగా పబ్లిక్ హాలిడే ఉంది. ఇందువల్ల ఆ పరీక్షను సెప్టెంబరు 8వ తేదీ నాటికి వాయిదా వేశారు. ఈ మేరకు లా కాలేజీలు, పరీక్షా కేంద్రాలకు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారిక ఉత్తర్వులు పంపిందని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో మూడు నెలలు అంటే నవంబరు 30వ తేదీ వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ పూర్తయ్యే వరకు పొడిగిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.ఆగస్టు 31నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు వారివారి సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక వేనాడు దర్గా



● నేడు 30వ గంథోత్సవం.. ఏర్పాట్లు పూర్తి

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం వేనాడులో 144 అడుగుల పొడవుతో ఉన్న దర్గా ఆసియాలోనే అతిపెద్దది. ఇక్కడి హజరత్ షేక్ దావూద్ షా వలీ అల్లా తాత దర్గా 30వ గంథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గా గంథోత్సవానికి హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గంథోత్సవానికి మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ దర్గాలో జెండా స్థాపన నుంచి గంథోత్సవం రోజు గంధాన్ని లేపనం చేసే వరకు హిందూ మతానికి చెందిన గ్రామ పెద్దలే చేస్తారు. ముస్లిం మత పెద్దలచే బాబా సంకీర్తనలు ఉంటాయి. ఈ గంథోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. దర్గా సమాధి చుట్టూ రేకులు షెడ్ తొలిగించి చుట్టూ సిమెంట్ గోడల నిర్మాణం చేపట్టారు. రెండు వైపులా భక్తులు గంథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద కిటికీలు ఏర్పాటు చేశారు. పైనా స్లాబ్‌వేసి వేశారు. దర్గా ప్రాంగణమంతా టైల్స్ వేశారు. జెండా స్థాపన వద్ద ప్రహరీ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గంథోత్సవం సందర్భంగా దర్గా నుంచి గ్రామ పొలిమేర్ల వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఇక షార్ సర్కిల్, రైల్వే స్టేషన్ నుంచి వేనాడు దర్గా వరకు ఆర్టీసీ పది బస్సులను ప్రత్యేకంగా నడపనుంది.

ఐఐటీలో ఎంటెక్ ప్రోగ్రామ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఏర్పేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో ఓ కొత్త అధ్యాయం మొదలయింది. దశాబ్దకాల ప్రస్థానంలో విశేష స్థానానికి చేరుకున్న ఈ ఉన్నత విద్యాసంస్థలో ఓ కొత్త కోర్సు ప్రారంభమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఎంటెక్ కోర్స్(అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ) శుక్రవారం శ్రీకారం చుట్టుకుంది. పరిశ్రమల మద్దతుతో ఈ కోర్స్ నిర్వహించనున్నట్లు ఐఐటీ వర్గాలు తెలిపాయి. కోర్స్ ప్రారంభ కార్యక్రమంలో అధికారులతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాలుపంచుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఓరియంటేషన్ కార్యక్రమానికి డీన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యం వహిస్తున్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త బ్యాచ్ విద్యార్థులకు తమ విద్యాసంస్థ లక్ష్యం, విలువలు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఆపరేషన్స్ అధినేత అశ్విన్ బజాజ్, అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సీఈవో విజయానంద్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యశోధన్ ప్రమోద్ గోఖలే తదితరులు పాల్గొని ప్రసంగించారు. 13మంది ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరారు. ఇందులో అమరాజా, జేఎస్‌డబ్ల్యూ వంటి పరిశ్రమల నుంచి స్పాన్సర్‌షిప్ పొందిన 12మంది ఉద్యోగులు ఉన్నారు. డీన్ శశిధర్ గుమ్మ తొలిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించగా డాక్టర్ సౌరవ్‌చక్రవర్తి ప్రసంగంతో ఓరియంటేషన్ ముగిసింది.



ఐఐటీ సమావేశానికి హాజరైన ప్రముఖులు

మా స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడుంది?

- సచివాలయాల చుట్టూ చక్కర్లు



స్మార్ట్ రేషన్ కార్డుల కోసం సచివాలయం వద్ద కార్డుదారులు

● నా పేరు స్రవంతి. మేము తిరుపతిలోని అశోక్‌నగర్‌లో ఉంటున్నాం. మా స్మార్టు రేషన్ కార్డు ఎక్కడ ఇస్తున్నారో తెలియక నాలుగు రోజులుగా జీవకోన, సత్యనారాయణ పురం, అశోక్‌నగర్, తుడా ఆఫీసు వద్ద వున్న సచివాలయాలకు వెళ్లి చూశాం. ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు. తీరా మా ప్రాంతానికి సంబంధంలేని ఓ వీఆర్వోను సంప్రదిస్తే జీవకోనలోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడకు వెళ్లి అడిగినా సరైన సమాధానం లేదు. తీరా అదే జీవకోనలో పదో వార్డులో నా కార్డు ఉంది.

● నా పేరు మనోహరి. మాది బాలాజీ కాలనీ. ఇప్పటి వరకు మేము బాలాజీ కాలనీలోనే రేషన్ తీసుకుంటున్నాం. స్మార్టు కార్డు గురించి మా సచివాలయంలో వీఆర్వోని అడిగితే ఇక్కడకు రాలేదన్నారు. ఇంతకు ముందు ఎక్కడ కాపురమున్నారో అక్కడకు వెళ్లి తీసుకోండని చెప్పారు. అక్కడకు వెళితే మా కార్డు చింతలచేనులోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడా నా కార్డు దొరకలేదు. ఇలా వారం రోజులుగా తిరిగినా.. ఇప్పటికీ దొరకలేదు.

.. ఇది స్రవంతి, మనోహరి సమస్యే కాదు. ఇలా ఎందరో స్మార్టు కార్డుల కోసం తిరుగుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా దాదాపు 5,91,259 పాత కార్డులున్నాయి. కొత్తగా మరో 44,937 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఎగ్జిస్టింగ్ కార్డులకే స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత వార్డు సచివాలయాల్లోని వీఆర్వోలు, వెల్ఫేర్ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో చేసిన రేషన్ కార్డుల మ్యాపింగ్‌తో.. ఎవరి కార్డు ఎక్కడుందో తెలియక కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా స్మార్టు కార్డులను పంపిణీ చేస్తున్నా చాలా మందికి వారి కార్డు ఎక్కడుందో తెలియని పరిస్థితి. దీంతో సచివాలయాల వద్ద కార్డుదారులు గుంపులుగా చేరుతున్నారు. తమకు స్మార్టు రేషన్ కార్డు వచ్చిందా.. లేదా అంటూ అధికారులను అడుగుతున్నారు. కొందరు డీలర్ల వద్దకెళ్లి కీ రిజిస్టర్ పరిశీలించినా అక్కడ కూడా కొంత మంది కార్డులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి కీ రిజిస్టర్ ఆధారంగా పంపిణీ చేస్తే కొంత వరకు సమస్య తగ్గుతుంది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, వచ్చే నెల ఒకటో తేది నుంచి డీలర్లు స్మార్టు కార్డులను అందజేస్తారని అన్నారు. అంత వరకు ఓపిగ్గా ఉండాలని సూచించారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్రవంతికి గిడుగు జాతీయ పురస్కారం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్, సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ స్రవంతి ఐతరాజు గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యం, వ్యక్తిత్వ రంగాల్లో ఆమె ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

తిరుచానూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో వెలసిన శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దర్శించుకున్నారు.ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



తిరుపతికి చేరిన త్రిసేనల బుద్ధ సర్క్యూట్ యాత్ర

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): త్రిసేనల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి 9గంటలకు తిరుపతికి చేరింది. కలెక్టరేట్ వద్ద వారికి డీఆర్వో నరసింహులు, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ యాత్రలో భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, అలాగే బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. బుద్ధుడి శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వంను దేశమంతటా వ్యాపించేటట్లు చేసే ప్రయత్నం జరుగుతోంది. బుద్ధ సర్క్యూట్ పేరిట సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషించడానికి ఈ మోటార్ సైకిల్‌యాత్ర ఉపకరిస్తుందని కన్వీనర్ రాహుల్ పాటిల్ తెలిపారు. నేపాల్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర శ్రీలంక వరకు కొనసాగుతుందని పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ బృందంలోని సభ్యులు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, ఆదివారం బయలుదేరతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, సాంస్కృతిక శాఖ ప్రతినిధి మునికుమార్ పాల్గొన్నారు.





తిరుపతికి చేరుకున్న బుద్ధ త్రిసేనల సర్క్యూట్ యాత్ర - యాత్ర ప్రతినిధులతో డీఆర్వో నరసింహులు, పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి

పొలాల్లో ఏనుగుల గుంపు దాడి





పంట ధ్వంసం దృశ్యాలు



చంద్రగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిన్నరామాపురం గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. పంటపొలాలపై విరుచుకుపడ్డాయి. అర్ధరాత్రి దాటాక ఏనుగుల గుంపు గ్రామానికి చెందిన బొమ్మల మునిరత్నం, భారతికు చెందిన పొలంలో భీభత్సం చేశాయి. అక్కడ నుంచి సమీపంలోని పశువుల గడ్డి వామును నేలమట్టం చేశాయి. పంటలను తొక్కి నాశనం చేశాయని బాధిత రైతులు వాపోయారు. పొలాలకు వేసిన కంచెను సైతం ధ్వంసం చేసుకుంటూ చెరువు మార్గం ద్వారా అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు వీరు చెబుతున్నారు. యేటా ఇదే రీతిలో పంట చేతికి అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో పాటు ఏనుగుల కట్టడికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.82కోట్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీల ద్వారా రూ.1,82,17,085 వచ్చింది. ఆలయ ఆవరణంలోని కొట్టు మండపంలో శుక్రవార హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 58 గ్రాములు, వెండి 510.600 కేజీలు, విదేశీ కరెన్సీ 265నోట్లు వచ్చాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ హుండీ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పాలకమండలికి 42 దరఖాస్తులు

తిరుపతి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో చోటుకోసం 42 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. గంగమ్మ ఆలయ ట్రస్టుబోర్డు నియామకం కోసం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈనెల 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 26వ తేదీలోపు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో దరఖాస్తులను స్క్రూట్నీ చేస్తున్నామని, దరఖాస్తుదారులు హాజరుకావాలని ఈవో కోరారు.